# సవతి తల్లి

**"మీరా"**

సుందరంగారి చిటికెన వ్రేలి ఆసరాతో ఆ యింటి కోడలిగా మొట్టమొదట కుడికాలు పెట్టింది ఆ ఇంటిలో శాంత. అందరికన్న చిన్నపిల్ల సుగుణ నాయనమ్మ సీతమ్మగారి కొంగు పట్టుకొని వింతగా కళ్లు పెద్దవిచేసుకుని చూస్తోంది. క్రొత్తగా అత్తవారి యింటిలో అడుగుపెట్టిన శాంతకు సంకోచంగాను ఉన్నది. ఎక్కడా సందడి, ఆర్భాటాలులేవు. గ్రుడ్లప్పగించి చూస్తున్న సుగుణను దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోబెట్టుకొంది. "ఏం చదువుతున్నావు పాపా ?" అని అడిగింది. భయపడుతూలేచి వెళ్లిపోబోయింది సుగుణ. "తప్పమ్మా ! మీ అమ్మ దగ్గర కూర్చో." అన్నది సీతమ్మగారు. "ఇప్పుడు యేం చదువుతున్నావమ్మా ?" అని మరల అడిగింది శాంత. "మూడు...." అని భయపడుతూ చెప్పింది సుగుణ.

"ఇది చిన్నపిల్లమ్మా ! దీని యిద్దరన్నలూ అలా బయటకు వెళ్లినట్లున్నారు." సీతమ్మగారు చెప్పింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర పెద్ద పిల్లలిద్దరూ కనిపించారు శాంతకు. "మీ అమ్మ వచ్చిందిరా !" అని సీతమ్మగారు అన్నది మనుమలతో.

"రా బాబూ !" అని దగ్గరకు పిలిస్తే వెళ్లలేదు రెండవవాడు చంద్రం. ఒకసారి తలెత్తి శాంతను చూచి మరల తలదించుకొన్నాడు పెద్దవాడు సూర్యం. శాంత మనస్సు చివుక్కుమన్నది.

ఆ రాత్రి .... శాంత కది వైవాహిక జీవితంలో మొదటి రోజు. భయపడుతూ అడుగు పెట్టింది గదిలో. నేల చూపులు చూస్తూ నిలబడింది. సుందరంగారు మంచంమీద కూర్చుని ఉన్నారు. శాంతను చూడగానే ఆయనకు తన మొదటి భార్యతో గడిపిన మొదటి రోజులు గుర్తుకు వచ్చాయి. ఔను ..... జానకి కూడ యిలాగే సిగ్గుపడుతూ గడప దగ్గర నిలబడిపోయింది. ఆయన నెమ్మదిగా పిలిచారు. "జానకీ ! ఇలా రా!" శాంత ఒక్కసారి గతుక్కుమంది. ఉలిక్కిపడి చూచింది తల యెత్తి. తన భాగ్యరేఖ, తన జీవిత భాగస్వామి యీ రూపంలో ప్రత్యక్ష మవుతాడని అనుకోలేదు. తను ఎన్ని కలలు కన్నది. నిరంతరం తన మొదటి భార్యనే తలంచుకొనే యీయనతో ఎలా జీవించడం ? ..... ఛీ .... ఛీ, ఏమిటి తన ఆలోచనలు. తన అదృష్టానికి బాధపడి ప్రయోజనం లేదు. తను ధైర్యంగా ఉండాలి. వారి మనస్సు అమృతమైతే తను బాధపడవలసిన పనే ఉండదు. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడి పెద్దవాళ్లను చేస్తే .... యీ జీవితానికి అదే తృప్తి .... ఈవిధంగా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

"జానకీ !" అని పిలిచిన తరువాత సుందరంగారు తన తప్పు తెలుసుకొన్నారు. శాంత ఏమనుకుంది ? పాపం ! రెండవ పెళ్లి భర్తనని ఆమె బాధపడుతూ ఉంటుంది. దానికి తోడు తాను యిలా ప్రవర్తిస్తూ యుంటే .... మొదటిసారి పెళ్లి జరిగినప్పటి ఉత్సాహం, సందడి, సరదాలు ఈసారి ఏమీ జరుగనేలేదు. ఆమె ఎన్నో వూహించుకొని ఉంటుంది. శాంతకు కష్టం కలుగకుండా చూడాలి. ఆమెను సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి. ఈవిధంగా అనుకొంటూ ఆయన నెమ్మదిగా లేచారు. "శాంతా ! కాళ్లు లాగడం లేదూ ? నిలబడిపోయావు." దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. శాంత నెమ్మదిగ వచ్చి మంచం మీద కూర్చుంది. ఆయన వచ్చి ప్రక్కను కూర్చున్నారు. "పిల్లల్ని చూశావు కదూ ? వాళ్లను నాకు వదిలి వాళ్ల తల్లి వెళ్లిపోయింది. ఇకనుండి నీవే వాళ్ల బాధ్యత వహించాలి. వాళ్ల కష్టం, సుఖం నీవు చూడాలి. నిన్ను చూడడానికి నేను ఉన్నాను." అన్నారు ఆయన. అంతకన్న ఏమి మాట్లాడాలో ఆయనకీ తోచలేదు. శాంత బుర్ర వూపింది.

*   *   *

శాంత వంద రూపాయలు తెచ్చుకొనే ఒక గుమాస్తా కూతురు. ఆమె తల్లిదండ్రులకు శాంత కాక మరో ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకూను. శాంత మూడవఫారం చదివింది. ఇంకా చదవాలనే ఉత్సాహం ఉన్నా తండ్రి ఇబ్బందులు తెలిసిఉన్నది కనుక ఇక చదివిన చదువులు చాల్లే అని తండ్రి అంటే బుర్ర ఊపింది. అందరి ఆడపిల్లలలాగే భవిష్యత్తును వూహించుకొని కలలు కన్నది. పెద్ద అందగాడు కాకపోయినా తన కీడైనవాడు కావాలని కోరుకొన్నది. పెద్ద ఉద్యోగస్థుడు ధనవంతుడు తన కవసరంలేదు. తనను అర్థం చేసుకోగల్గే హృదయ మున్నవాడు చాలు ననుకొన్నది. తండ్రి పెద్ద కూతురు పెండ్లి చేయడానికే ఎన్నో అవస్థలు పడ్డాడు. తల బొప్పి కట్టింది. కూతురు ఇష్టపడినవానికి చేయాలంటే ఈరోజుల్లో తా నెక్కడ తేగలడు కట్నాలు ? కాళ్ల దగ్గరకు వచ్చిన సంబంధం. బాగా కలిగిన కుటుంబం. రెండవపెళ్లివాడైతేనేమి ? మరీ పెద్ద వయస్సు కాదుగా, చక్కటి సంబంధం. కోరుకున్నవన్నీ తీరుతాయి. కూతురు సుఖపడుతుంది. ఈ ఆలోచనలతోనే శాంత తండ్రి సుందరంగారి సంబంధం స్థిరపరిచాడు. తల్లీ కూతుళ్ల కిద్దరికీ నచ్చలేదు.

కాని పెద్ద పెద్ద కట్నాలు పోస్తేనేగాని పెళ్ళికొడుకులు రాని యీ రోజుల్లో ఏమి చేస్తారు ? త్వరలోనే పెద్ద ఆర్భాటాలేమీ లేకుండా దేవుని సన్నిధిలో పెళ్ళి చేసుకుని శాంతను ఇంటికి తీసుకొని వచ్చారు సుందరంగారు.

పెద్దబ్బాయి సూర్యం పదిహేనేళ్ళవాడు. అతను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇప్పుడిప్పుడే ప్రపంచం అర్థం అవుతోంది. సూర్యం మనస్సు గంభీరమైనది. తమ్ముడు, చెల్లి అంటే అభిమానం. తల్లి పోయిన దగ్గరనుండి వాళ్ళంటే మరీ ప్రేమగా చూస్తూ ఉంటాడు. చెల్లిని చూచి అప్పుడప్పుడు కన్నీళ్ళు కూడా పెడుతూ ఉంటాడు. రాత్రి పడుకున్న తరువాత అతని మస్తిష్కంలో ఆలోచనలు ముసిరి మనస్సు కలవరపడుతూ ఉంటుంది. అతని కన్నీళ్ళకు తలగడే సాక్షి. తను, తమ్ముడు మొగపిల్లలు. కాని సుగుణ విషయమే అతనిని బాధిస్తూ ఉంటుంది. తండ్రి మరల పెండ్లి ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడంటే విని బాధపడ్డాడు. వచ్చే తల్లి ఎటువంటిదో ? .... కాని శాంతను చూచిన తరువాత తాను అంతగ భయపడడం అవివేక మనిపించింది. ఆమె ..... తను క్రొత్త అమ్మ మంచిదిలాగనే కనిపిస్తున్నది. కాని .... యేమో, తరువాత .... యెలా ఉంటుందో. ఇప్పుడున్న మమకారం ఆమెకు పిల్లలు పుట్టిన తరువాత ఉంటుందా ? ఏమైనా ఇంక అన్నిటికి ఎదురు చూడాలి, అనుకొన్నాడు సూర్యం.

పన్నెండేళ్ల చంద్రం మూడవ ఫారం చదువుతున్నాడు. ఏ చిన్న విషయమైన వింతగ, తన కందినంతవరకు లోతుగా ఆలోచించడం చంద్రం అలవాటు. అతనిమీద పరిసరాల ప్రభావం త్వరగా పడుతుంది. ఆ వయస్సు కూడ అటువంటిదే. చిన్నప్పుడు తాను నాయనమ్మ దగ్గర విన్న కథల్లో, తను చదువుకున్న చిన్న పిల్లల కథల పుస్తకాలలో కొన్ని సవతి తల్లి కథలు కూడ ఉన్నాయి. ఆ సవతితల్లు లందరూ గయ్యాళిగంపలు. సవతి పిల్లల్ని పీక్కుతినే రాబందులు. కొంత మంది తమ సవతి పిల్లల్ని చంపడానికి కూడ ప్రయత్నించారు. అమ్మ చచ్చిపోయిన తరువాత తమకు సవతి తల్లి వస్తుందని యెవరూ చెప్పలేదు. ఒకరోజు నాన్నగారు పెళ్లి చేసుకొని మరీ తీసుకొని వచ్చారు. అప్పుడే భయం వేసింది చంద్రానికి. అందుకే ఆమె పిలిచినా దగ్గరకు వెళ్ళలేదు చంద్రం. కాని చూడగా చూడగా తవ క్రొత్త అమ్మ చాల మంచిదేహా అనిపిస్తోంది. కొంతమంది సవతి తల్లులు మంచివాళ్ళు కూడ ఉంటారు కాబోలు అనుకొన్నాడు చంద్రం.

చిన్నపిల్ల సుగుణ ఎనిమిది సంవత్సరాలది. అందరికంటె చిన్నది. అందులోను ఆడపిల్ల ఒక్కతే అవడంతో సుగుణ చిన్నతనం నుండి ముద్దుగ, గారాబంగా పెరిగింది. ఆ గారాబమే ఆ పిల్లకు పెంకెతనం, మంకుతనం నేర్పింది. కావాలనుకొన్నది వెంటనే జరిగి తీరవలసిందే. లేకపోతే ఆ యింట్లో ఎవరికి స్థిమితం ఉండదు. ఉండనివ్వదు సుగుణ. తల్లి పోయిన దగ్గరనుండి నాయనమ్మ మరింత గారాబం చేసింది. ఎవరికీ భయపడని సుగుణ కోపిష్టి అయిన తండ్రికి మాత్రం భయపడుతుంది. సుగుణకు కావలసినవి అమర్చిపెట్టి ఆమె అవునన్న దానికి వూకొట్టితే ఆమె అంత మంచిపిల్ల మరొకరు ఉండనే ఉండరు..

శాంతకు ఆ ఇంటిలోని ఒక్కొక్కరి మనస్తత్వాలు నెమ్మది నెమ్మదిగ అర్థమవుతున్నాయి. నెమ్మదిగ ఆ సంసారానికి అలవాటు పడింది. సుగుణ ఇంటికి దగ్గర బడిలోనే మూడవ తరగతి చదువుతోంది. ఆ అమ్మాయికి ఉదయం 8 గంటలకే బడి. శాంత తెల్లవారుఝామునే లేస్తుంది. ఏదైనా ఫలహారం తయారుచేస్తుంది. తరువాత సుగుణకు తలదువ్వి, బొట్టు పెట్టి, ఫలహారం, కాఫీ యిచ్చి బడికి పంపుతుంది. సుగుణకు త్వరగా చనువు ఏర్పడింది శాంత దగ్గర. క్రొత్త పోగానే తల్లి దగ్గర గారాలు చేయడం నేర్చింది. ఉదయం బడికి వెళ్లిన సుగుణ తిరిగి ఇంటికి పదకొండు గంటలకు వస్తుంది. వస్తూనే పుస్తకాల సంచీ విసిరి "అమ్మా ! అన్నంపెట్టు" అంటూ కేకలేస్తుంది. ఒక్క క్షణం ఆలస్యమైనా వూరుకోదు.

తన పనులమీద బయటకు వెళ్లి తిరిగి 12 గంటలకు వచ్చే సుందరంగారు ఆరోజు పదకొండు గంటలకే ఇంటికి వచ్చారు. ఆయన వెనుకనే మేడపైకి వెళ్ళింది శాంత ముఖం కడుక్కోవటానికి సబ్బూ, తువాలు అందివ్వడానికి. సరిగ్గా ఆదే సమయాన "అమ్మోయ్ ! ఆకలి—త్వరగా అన్నంపెట్టు" అంటూ వీధిలోనుండే కేకలేసుకుంటూ వచ్చింది సుగుణ. మేడపైన ఉన్న శాంతకు సుగుణ పిలుపు వినిపించలేదు. శాంత పలకకపోయేసరికి "అన్నం ! అన్నం!" అనుకొంటూ ఏడ్పు లంకించుకొంది సుగుణ. ఇల్లు ఎగిరిపోయేలా ఏడ్పులూ రంకెలూ. "వస్తున్నానమ్మా !" అంటూ కంగారుపడుతూ పలికింది శాంత మెట్లు దిగుతూ. పైన ఉన్న సుందరంగారు కూడ విన్నారు ఆమె ఏడ్పులు. "సుగుణా ! ఏమిటా అరుపులు ? అమ్మ వచ్చేవరకూ ఆగలేవూ ?" అని కోపంగా ఉరిమారు. సాధారణంగా తను వచ్చేసరికి నాన్నగారు రారు. తండ్రి లేరనే ధైర్యంతోనే సుగుణ అంత గట్టిగా ఏడుస్తోంది. తండ్రి కేకతో ఉలిక్కిపడి వచ్చే రాగాన్ని నోట్లోనే అణుచుకొంది. అది వెక్కిల రూపంలో బయటపడసాగింది. అంతలో మూల గదిలో నిద్రపోతున్న సీతమ్మగారు లేవనే లేచారు.

"ఇంక నీ గార మెక్కడ సాగుతుందే తల్లీ ? మీ అమ్మ అనుకొన్నావా ఏమిటి ?" అని సణుగుతూ లేచింది. అంతలో శాంత వచ్చింది. "రావమ్మా ! సుగుణా ! అలా ఏడుస్తారా ఎవరైనా ? నాన్నగారు కోప్పడుతారు. లే .... అన్నం పెడతాను." అంటూ సుగుణ చెయ్యి పట్టుకొని తీసికెళ్లబోయింది. "నాకొద్దు పో !" అని విసిరికొట్టింది సుగుణ. "రా అమ్మా ! నా తల్లి కదూ ? మా సుగుణ చాల మంచిది. అసలు ఏడవనే

ఏడవదు. చెప్పినమాట వింటుంది,'' అంటూ వూరడించ బోయింది. ఆ మంకుపిల్ల మరీ బిగుసుకుపోయింది.

"శాంతా! అన్నం వడ్డించావా ?'' సుందరంగారు కేక వేశారు పైనుండి.

"వెళ్లు తల్లీ! నీ మొగుడికి అన్నం పెట్టు. దానికి నేను పెడతానులే. నాకు తప్పుతుందా ?'' అంటూ వచ్చింది సీతమ్మగారు. శాంత మనస్సు చివుక్కుమంది. ఏమీ అనలేక భర్తకు అన్నం వడ్డించడానికి వెళ్లింది. మరో రోజు వరకు సుగుణ శాంత దగ్గరకు వెళ్లనేలేదు.

ఆరోజు బారసాలకు రమ్మని ఎవరో పేరంటానికి పిలిచారు. సుగుణను తీసుకొని బయలుదేరింది శాంత. హాలులో అడుగు పెట్టగానే పేరంటాళ్ల అందరి దృష్టులు ఆమె మీదనే పడ్డాయి. కొంతమంది పైనుండి క్రింది వరకు చూడడం మొదలుపెట్టారు. ఏదో తప్పు చేసినట్లుగా ముడుచుకుపోయింది శాంత. సుగుణ చెయ్యి పట్టుకొని నెమ్మదిగా ఒక మూలకు వెళ్లి కూర్చుంది. పేరంటానికి పిలిచినావిడ ఒకసారి వచ్చి పలుకరించి "ఇప్పుడే వస్తానమ్మా! లోపల కొద్దిగా పని ఉన్నది'' అంటూ వెళ్లిపోయింది. శాంతకు అందరూ క్రొత్త. పేరంటాళ్లు అందరూ ఇద్దరు, ముగ్గురు చేరి కబుర్లలో పడ్డారు. శాంతకు ఏమి చేయడానికి తోచక ముళ్ల మీద కూర్చునట్లు ఉన్నది.

"ఆమూల ఆకుపచ్చ చీర కట్టుకొని కూర్చున్నావిడేనా సుందరంగారి పెళ్లాం ?'' ఆ ప్రక్కనుండి నెమ్మదిగా ఎవరో అడుగుతున్న ప్రశ్న వినిపించింది.

"ఇన్నాళ్లూ చూడలేదేమిటి ? ఆవిడే సుందరంగారి భార్య.'' మరొకామె సమాధాన మిచ్చింది.

"పిల్లల్ని యెలా చూస్తుందట ? .... ఆఁ .... ఎంతైనా సవతి తల్లి కదూ ?'' ప్రశ్నించి తనే సమాధానం చెప్పుకొంది మొదటావిడ. "అంతేలే!'' అన్నది రెండవ ఆమె. వాళ్లు గుసగుసలుగా మాట్లాడినా అన్నీ శాంతకు విన్పిస్తూనే ఉన్నాయి. ఒక్కొక్కమాట ఆమె హృదయంలో ములుకులా గ్రుచ్చుకొంటోంది.

"ఆవిడ అలా అందరికి దూరంగాపోయి కూర్చున్నదేమో? లక్షాధికారి పెళ్లాన్ననికాబోలు!'' ఎవరో ఒక సామాన్య కుటుంబీకురాలు తన అక్కసు వెళ్లగ్రక్కింది.

"ఔనౌను. ముసలి మొగుణ్ణిచూచి మురిసి పోతున్నది. ఇంటికి యెవరువెళ్లినా మాట్లాడదట.'' అన్నది మరో పేరంటాలు. ఇక వినలేకపోయింది శాంత. అక్కడ ఒక్కనిముషం ఉండ బుద్ధికాలేదు. కాని పేరంటం పూర్తికానిదేవెళ్తే బాగుండదు. ప్రక్కనచూస్తే సుగుణలేదు. పిల్లలతో ఆడుకోనువెళ్లినట్లున్నది. శాంత నెమ్మదిగా లేచి లోపలిగదిలోకి వెళ్లింది ఇంటావిడ కనిపిస్తుందేమోనని. అక్కడ గదులలోకూడా పేరంటాళ్లు కూర్చుని ఉన్నారు. నెమ్మదిగా వెళ్తున్న శాంతకు ప్రక్కగదిలో నుండి తననుగురించిన మాటలే విన్పించడంతో ఆగిపోయింది. "ఏమే, సుగుణా! మీ అమ్మ బాగాచూస్తుందా మిమ్మల్ని ?'' అని యెవరో సుగుణను ప్రశ్నిస్తున్నారు.

"బాగా చూడ్డమేమిటి ? అందరూ చూచినట్లే చూస్తుంది.'' అంటున్నది అమాయకురాలైన ఆ చిన్నపిల్ల. "అయ్యో! పిచ్చిపిల్లా!! ఇంత అమాయకురాలివైతే సవితి తల్లితో యేలా వేగుతావే నాతల్లీ!'' ప్రశ్నించి నావిడ కంగారుతో కూడిన గొంతు విన్పించింది.

"మీ అమ్మ అప్పచ్చులు అవీ చేసిపెడుతుందా ?.... ఎప్పుడైనా కొడుతూ ఉంటుందేమిటే మీ అమ్మ....?'' కౌతుకంతో అడిగింది మరోగొంతు.

"మా అమ్మ యెప్పుడూ కొట్టలేదు. ఎందుకూ కొట్టడం ?'' అంటూ తిరిగి ప్రశ్నించింది సుగుణ. ఆ పేరంటాళ్లు నోళ్లు నొక్కుకుంటున్నారు కాబోలు మళ్లీ వాళ్లమాటలు విన్పించలేదు.

ఏమీ తెలియని అమాయకురాలైన చిన్నపిల్ల హృదయంలో విషం నింపుతున్నారు. ఇదే ఆలోచిస్తోంది శాంత. ఆమె మనస్సు వేదనతో కుమిలిపోయింది. ఇంకా ఆచిన్నపిల్ల మనస్సు యేమి విరిచేస్తారో ? సవతితల్లి అంటే రాక్షసిఅనే అభిప్రాయం ఆపిల్లమనస్సులో హత్తుతారుకాబోలు. ఆ ఆలోచనరాగానే చటుక్కున ఆ గదిలో ప్రవేశించింది శాంత. అక్కడున్న సువాసినుల ముఖాలు క్షణకాలం వెలవెల బోయాయి. కాని మరుక్షణంలోనే ఒకామె తేరుకొని "రావమ్మా, రా! మీ అమ్మరాలేదా అని అడుగుతున్నాను సుగుణను. సావిట్లో కూర్చున్నావా ?'' అంది. శాంత తెల్లబోయింది. ఆమె యెవరో శాంతకంతగా పరిచయంలేదు. సుగుణ, మరో అమ్మాయి చెట్టాపట్టాలు వేసుకొని వెళ్లిపోయారు అక్కడినుండి. శాంతను పలుకరించినావిడ "శాంతరా ! అలా చూస్తారేమిటి ? సీతమ్మగారి కోడలు.'' అంటూ మిగతావారికి పరిచయంచేసింది.

"రావమ్మా! శాంతా! ఇంకా నీకు క్రొత్తకదూ ? ఎవరూ తెలియదనుకొంటాను. ఈవిడ నారాయణగారి పెళ్లాం, అదిగో ఆవిడ మీయింటికి రెండిళ్ల యివతలఉన్న చంద్రయ్యగారి కోడలు.'' అంటూ అందర్నీ పరిచయం చేసింది. శాంతమాట్లాడకుండా కూర్చుంది.

"ఆదేమిటమ్మా ! అలా సిగ్గుపడతావు. నన్ను మర్చిపోయావేమిటి ? కాంతమ్మ పిన్నినే నేను.'' అంటూ తనను పరిచయంచేసుకొంది. శాంత బుర్ర ఊపింది. ఆ కాంతమ్మ పిన్నిగారు చాలాసేపు ఆ కబుర్లు యీ కబుర్లుచెప్పి చివరికి అన్నది.

"మీ అత్తగారు బాగా చూస్తారా ?.... ఆవిడో కోపిష్ఠి. మీ సవతిని అలాగే రాచి రంపాన్నిపెట్టేది. పిల్లలెలా ఉంటున్నారు?

వాళ్ళ గయ్యాళి పిల్లలమ్మా ! పీక్కుతినేస్తారు. నీవసలే మెతక దానివి. ఎలా వేగుతున్నావో యేమో ఈ వయస్సులో మొగుడితో చిలకా గోరింకల్లా తిరగాల్సింది.'' ఆవిడ బడబడా వాగేస్తోంది.

శాంత నెమ్మదిగా అన్నది. ''పిల్లలు రత్నాలండీ ! వాళ్ళతో కాలం సరదాగా గడచిపోతోంది.'' కాంతమ్మగారు మూతి మూడు వంకర్లు తిప్పింది.

''ఇంకా క్రొత్తకదూ ? అలాగే ఉంటారు. మరో నాల్గ రోజులుపోనీ, యీ కాంతమ్మపిన్ని చెప్పినమాట నిజమోకాదో నీకే తెలుస్తుంది.'' ఆవిడ సవాలుచేసినట్లుగా మాట్లాడింది. ఆమె మాటల ధోరణి చూస్తుంటే శాంతకు అసహ్యమనిపించింది. పేరంటంపూర్తయ్యి శాంత బయలుదేరివచ్చేవరకు కాంతమ్మగారు అలావాగుతూనే ఉన్నది.

*    *    *

నాలుగు నెలలు గడచిపోయాయి. మధ్య యిలా యిరుగు పొరుగులనే మాటలు, పిల్లల్ని సవతితల్లి సరిగా చూడదేమోనని అత్తగారు సీతమ్మగారు తీసుకొనే జాగ్రత్తలు శాంత మన స్సును బాధపెట్టేవి. సవతి తల్లి అంటే ఉండే సాధారణమైన అభిప్రాయం వలన అందరూ యిలా ప్రవర్తిస్తున్నారని, రోజులు జరిగేకొలది అర్థం చేసుకొంటారులే అని సరిపెట్టు కునేది శాంత.

సంక్రాంతి దగ్గరకు వచ్చింది. కూతుర్ని, అల్లుడ్ని పండుగకు పిల్చుకు వెళ్ళడానికి శాంత తల్లిదండ్రులు వచ్చారు. పనులు ఎక్కువగా ఉండడం వలన సుందరంగారు పండుగ రేపు ఉన్నదనగా వస్తామని అన్నారు. శాంత ఒక్కతే బయలు దేరింది. తనతో సుగుణను పంపమని అడిగింది కాని, సీతమ్మ గారు అభ్యంతరం చెప్పారు. ''నీవు వెళ్లిరా అమ్మా ! సూర్యం, చంద్రం దాన్ని విడిచి ఉండలేరు. ఐనా అది లేకపోతే అసలు సందడే ఉండదు.'' అన్నదామె. ఇక శాంత ఒక్కతే వెళ్లింది.

శాంత అక్కగారు అన్నపూర్ణ కూడ పండుగకు పుట్టిం టికి వచ్చింది. అక్కతోను, చెల్లెళ్ళ, తమ్ముడుతో శాంతకు చాలా సరదాగా గడిచిపోతోంది కాలం. రెండు రోజుల తర్వాత అన్నపూర్ణ చెల్లిని నెమ్మదిగా కదలవేసింది. ''ఏమే, శాంతా ! మీ ఆయన బాగా చూస్తారా నిన్ను ?'' అంటూ. శాంత సిగ్గుగా తల వూపింది.

''మీ అత్తగారు నోటి దురుసు మనిషి అని విన్నాను. నిజమేనా ? నీతో ఎలా ఉంటుంది ?'' రెండవ ప్రశ్న వేసింది అన్నపూర్ణ.

''అబ్బ ! ఈ ప్రశ్న లేమిటే ? ఎవరు చెప్పారు నీకు అలాగని ?'' చికాకుగా ప్రశ్నించింది శాంత.

''అంత చిరాకేమిటే నీకు ? చెల్లిని ఆమాత్రం అడగ కూడదా ? నీ మంచి చెడ్డ లేమిటో తెలిసికొందామని అడుగు తున్నాను. ప్రొద్దుట లేచిన దానివి రాత్రి అందరి భోజనాలు అయ్యే వరకు వంచిన నడుం యెత్తడానికే వీలుండదట. అమ్మ చెప్పింది. ఏం పనంతా నీవే చేయాలా ? మీ అత్తగారు సాయం చెయ్యదా ? లేకపోతే ఒక వంటమనిషిని పెట్టుకోక పోయినారా ?'' గడగడా అడిగివేసింది అన్నపూర్ణ. శాంత మాట్లాడలేదు.

''మొగపిల్లలిద్దరు మొగం తిప్పుకొనే ఉంటారుట నీ గాలే పడనట్లు ?'' అంతలో శాంత తల్లి వచ్చింది. ''దాని సంగతి, దాని అత్తవారి సంగతి యేమి చెప్పమంటావే ? వద్దండీ అంటే వినకుండా గొప్పింటి సంబంధం. కూతురు సుఖపడు తుంది అంటూ చేశారు మీనాన్న యీ రెండవ పెళ్లి సంబం ధము. ఒక అచ్చటా, ముచ్చటా ? ఇంటిల్లపాదిచాకిరీ అదే చెయ్యాలి. ఆ యింటిని చూచి మురిసిపోవాలి. మళ్లీ ఆ దివా ణంలో చాకిరి చెయ్యడానికి ఒక్క నౌకరు లేడు.'' ఒక్కసారి గుక్కతిప్పుకోవడానికి ఆగిందామె. ఏదో వినరాని మాటలు వింటున్నట్టు వింతగా ముఖంపెట్టి వింటున్నది అన్నపూర్ణ.

''ఇక పిల్లలంటావా ? .... పెద్దపిల్ల లిద్దరు నాలి ముచ్చులు .... చిన్నపిల్లేమో .... దానంత పేచీకోరుపిల్ల మరొ కతె ఉండనే ఉండదు. పనిలో ఉండి ఒక్క నిముషం తాళవే అమ్మా అంటే గొంతెత్తుతుంది. అత్తగారు కొంప మునిగి పోయినట్లు ఏమిటే అంటూ పరుగెత్తుకొస్తుంది.'' తల్లి వరుస చూచి శాంతకు చిరాకెత్తింది.

''చిన్నపిల్లలన్న తరువాత ఏడవకుండా ఉంటారా అమ్మా ? అందులోనూ చిన్నప్పటినుండి గారాబంగా పెరిగిం దాయె. ఇంక సూర్యం, చంద్రం అంటావా ? వాళ్ళ మొగ పిల్లలు. ఎప్పుడూ బయట తిరుగుతూ ఉంటారు. ఇంకా నా దగ్గర చనువు ఏర్పడలేదు.'' అన్నది.

అన్నపూర్ణ విస్తుపోయి చూచింది చెల్లివంక. ''ఎన్ని కబుర్లు నేర్చావే శాంతా ! అత్తవారిమీద ఈగ వాలనివ్వడం లేదు. నీకూ పిల్లలు పుట్టనీ ! నీ పిల్లలనీ ఇంత గారాబం చేస్తారో లేదో చూస్తాను.'' సవాలు చేసినట్లు మాట్లా డింది అన్నపూర్ణ. శాంతకు ఒళ్లు మండింది. తనకు రెండవ పెళ్లివాణ్ణి చేసినప్పు డేమయ్యింది ? తనకీ పెళ్లి వద్దన్న ప్పుడు అనునయించిన కబుర్లన్నీ ఏమయ్యాయి? అప్పుడీ ఆలో చనలన్నీ రాలేదా వీళ్లకు ? జరిగిన దానితో తృప్తి పడుతుంటే యీరోజు తన మనస్సులో విషబీజాలు నాటుతా రెందుకు ?'' అనుకొన్నది మనస్సులో. వికలమైన మనస్సుతో నెమ్మదిగా అక్కడినుండి లేచింది.

''అక్కడికి వెళ్లి ఇదింత దద్దమ్మగా తయారయ్యిం దేమే! ఇదీ, దీనికి పుట్టబోయే పిల్లలూ ఆ యింటిలో నౌకర్లలా బ్రతకవలసిందే''. సానుభూతితో తల్లి అంటున్న మాటలు వినిపించాయి వెనుకనుండి. శాంత ఒక్క నిట్టూర్పు విడిచింది.

పండుగకు వచ్చి మూడు రోజులుండి వెళ్లిపోయారు సుందరంగారు. ఆ మరునాడు శాంత స్నేహితురాలు లలిత వచ్చింది, శాంతను చూడడానికి. ఆమె కళ్లల్లో ఏదో జాలి ప్రకటితమవుతోంది. ఎందుకో అర్థంకాలేదు శాంతకు.

"శాంతా! మీ అయన్ని చూపించకుండానే పంపేశావు?" అన్నది లలిత.

శాంత నవ్వి "వారికి చాల పనులున్నాయి లలితా, ఆయన లేకపోతే యింటిదగ్గర చాల అవస్థ అవుతుంది" అన్నది.

లలిత నిట్టూర్చింది. "క్రొత్త అల్లుడు. పెద్ద పండుగకు వచ్చి పదిరోజులు అత్తవారి ఇంటిదగ్గ రుండడానికే తీరికలేకపోయింది. ఎన్నెన్ని కలలు కన్నావు శాంతా! నీ ఆశ లన్నీ కూలిపోయాయి. మొన్న మీవారు, మీ నాన్నగారు అలా కలసి వెళ్తూంటే చూశాను. దాదాపు మీ నాన్న వయస్సు ఉంటుందికదూ?" ఆ గొంతులో జాలే ప్రస్ఫుట మవు తోందో, కుతూహలమో అర్థంకాలేదు.

"నాన్నకంటె చిన్నవారే" అన్నది శాంత నెమ్మదిగా.

కాని లలిత శాంత మాటను తేలికగా కొట్టి పార వేసింది. "ఎంత చిన్న అయితే మాత్రం, ఆయనకు ఎలా లేదన్నా నలభై సంవత్సరాలు ఉంటాయనుకొంటాను. పాపం! నిన్ను చూస్తుంటే జాలేస్తుంది శాంతా! నీ అందానికి, తెలి వికి తగిన వరుడేనా ఆయన?" లలిత సానుభూతిగా పలికింది.

"అలా అనకు లలితా! ఆయన వయస్సులో కొద్దిగా పెద్ద కాని హృదయం చాల మంచిది. ఎప్పుడూ నే నెక్కడ బాధపడతానో అని నన్ను ఒక కంట చూచుకొంటూ ఉంటారు. అది నా అదృష్టమే!"

లలిత ఆశ్చర్యంగా చూచింది. "నీ వెర్రి చెప్పు శాంతా! రెండో పెళ్లి రెండో పెళ్లే. నీవేమిటో చెప్తున్నావుగాని ముసలి వాళ్లకు కోపం యెక్కువంటారు. మన స్నేహితురాళ్లలో నీ అదృష్టమే ఇలా అయ్యింది." అన్నది జాలిగా.

శాంత మనస్సు కలుక్కుమన్నది. ఆమెకు కోపం కూడ వచ్చింది. తనకు వద్దంటున్నా వీళ్లంతా సానుభూతి చూపిస్తా రెందుకు? మనుష్యుల్ని అర్థం చేసుకోకుండా మాట్లాడు తారు. తానంటె తన భర్త లెక్కచెయ్యడనీ, ఎప్పుడూ కోపంగా, చిరాకుగా ఉంటాడనీ, అతనికంటె ఒక నల్లరాతిని కట్టుకొంటే తాను సుఖపడి ఉండేదాననని ఒకప్పుడు విచారిం చిన లలితేనా యీరోజు తనను చూచి సానుభూతి చూపి స్తున్నది? తనకేం లోటని తన అదృష్టం మాసిపోయిం దనుకోవాలి?" శాంత కోపంగా మనస్సులో తర్కించు కొంటోంది.

"నీకు ముగ్గురు పిల్లలట కదూ? మీ పెద్దబ్బాయికే పదహారు సంవత్సరాలు ఉంటాయట? ఏం బ్రతుకు నీది? పెళ్లితోనే ముగ్గురు పిల్లలు. మరో ఐదారు సంవత్సరాలు పోతే నాయనమ్మ వవుతా వనుకుంటాను" లలిత సాను భూతిగా నవ్వింది. ఇది వినేసరికి శాంత మనస్సులో ఎక్కడో చురుక్కుమన్నది. తానేదైతే మర్చిపోవా లనుకొంటున్నదో అవన్నీ వీళ్లు భూతద్దంలో పెట్టి మరీ చూపిస్తున్నారు. తా నొద్దంటున్నా బలవంతాన చూపిస్తున్నారు. ఛీ! .... ఛీ!! .... ఏం మనుష్యులు!!! ఇక్కడుంటే తన మనస్సు విరిచే స్తారు. ఇక్కడినుండి త్వరగా పారిపోవాలి.

"ఏమిటి శాంతా, దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" లలిత ప్రశ్నతో యీ లోకంలో కొచ్చింది శాంత.

"ఆఁ.... ఏంలేదు. పోనీగాని నీ సంగతులు చెప్పు వింటాను. మీవా రొచ్చారా పండుగకు?" అంటూ మాట మార్చింది శాంత.

మరో వారం రోజులలో పట్టుబట్టి శాంత అత్తవారి ఇంటికి తిరిగి వచ్చింది. పండుగకు శాంతకు నెక్లెస్ చేయించి యివ్వాలనుకున్నారు సుందరంగారు. నెక్లెస్ చెయ్యమని కంసాలికి పురమాయించారు కూడాను. కాని పనుల వత్తిడి వల్ల కంసాలి పండుగకు వస్తువు అందివ్వలేకపోయాడు. శాంత తిరిగి వచ్చిన రెండు రోజులకు నెక్లెస్ తీసుకొని వచ్చారు సుందరంగారు. ముచ్చటగా ఉన్న ఆ నెక్లెస్ చూడ గానే శాంత ముఖం విప్పారింది. విప్పారిన ఆమె ముఖం చూడ గానే సుందరంగారి మనస్సు తేలికయినట్లయింది. తనవల్ల సుఖంలేదని శాంత అసంతృప్తి పడుతుందేమోనని ఎప్పుడూ ఆయన మథనపడుతూ ఉంటారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆమెను సంతోషపర్చాలని ఆయన ప్రయత్నం.

సీతమ్మగారు నెక్లెస్ చూడగానే ముఖం ముడ్చు కొన్నది. "సుగుణకు కూడ ఒకటి చేయించలేక పోయినావురా నాయనా?" అని ప్రశ్నించింది కొడుకును.

"అప్పుడే దానికి అంత పెద్ద వస్తువులు యెందుకు, యెక్కడో జారపెడ్తుంది." అని ముక్తసరిగా అని అక్కడి నుండి వెళ్లిపోయారు సుందరంగారు.

"పడుచు పెళ్లాం మాయలో పడ్డాడు" అంటూ మనస్సులో గొణుక్కుంటూ లేచింది సీతమ్మగారు.

మరునాడు బడికి వెళ్తూ నెక్లెస్ పెట్టమని పట్టు బట్టింది సుగుణ. ఆటల్లో ఎక్కడైనా పడవేస్తుందేమోనని సందేహించింది శాంత.

"దాని గొంతు ఎండిపోయేలా యేడుస్తుంటే రాయిలా అలా కూర్చుంటావేమే. సరదా పడుతోంది. పోనీ కొంతసేపు పెడ్డామనే ఆలోచన లేకపోయిందా నీకు?" అని అత్తగారు కేకలేసింది. శాంత మాట్లాడకుండా వెళ్లి బీరువా తెరిచి నెక్లెస్ తీసి సుగుణ మెడలో పెట్టింది. గంతులు వేసుకొంటూ బడికి వెళ్లింది సుగుణ. నెక్లెస్ చూచి పిల్లలంతా తన చుట్టూ

చేరడం చూస్తే సుగుణకు ఎంతో గొప్పగా ఉంది. ఇక రోజా నెక్లెస్ పెట్టనిదే బడికి వెళ్లేది కాదు.

ఆరోజు ఆటల్లో దొంగ అయిన అమ్మాయి సుగుణను ఔట్ చెయ్యడానికి నెక్లెస్ పట్టుకు లాగింది. బలంగా లాగడంతో అది పుటుక్కు మన్నది. అది తెలియగానే శాంత హృదయం కలుక్కుమంది. సుగుణమీద పట్టలేనంత కోపం వచ్చింది.

"చెప్పినమాట వినిపించుకోంటేనా .... ?" అన్నది. వచ్చిన కోపాన్ని బలవంతాన అణచుకొంటూ. సుగుణ బిక్కమొఖం పెట్టింది.

"సరేలే ! చిన్నపిల్ల, దానిని కోప్పడుతా వెందుకు ? కంసాలి కిస్తే సరి, రేపు తెచ్చిపెడ్తాడు" అని అత్తగారు అందుకొంది.

ఈ సంగతి సుందరంగారి చెవుల పడగానే ఆయన ఉగ్రు డయ్యారు.

"నీకు బుద్ధి ఉండొద్దు శాంతా ! చిన్నపిల్లకు నెక్లెస్ పెట్టమని ఎవరు చెప్పారు ?" కళ్లెర్రచేసుకొని అడిగారు. శాంత ఆయన కోపం ఎప్పుడూ చూడలేదు. ఆమె గుండె దడదడ లాడింది.

"సుగుణ కావాలని ఏడుస్తుంటే ..... " అంటూ నాన్చేసింది.

"అఘోరించలేకపోయినావు. ఏడిస్తే పెట్టాలా, అయినా పెట్టుకొనే రాతుండొద్దూ నీ ముఖానికి ?" అన్నారు కోపంగా. ఎవరి సంతోషం కొరకైతే ఆ వస్తువు చేయించారో ఆమెనే మాటలతో నొప్పిస్తున్నాననే జ్ఞానం లేకపోయింది ఆయనకు ఆ కోపంలో. శాంతకు ఉప్పొంగి వచ్చింది ఏడుపు. అసలే తాను ఒక్కసారి కూడ పెట్టుకోకుండా తెగిపోయిందని శాంత బాధపడ్తోంది. దానికి తోడు తప్పంతా తనదే అన్నట్లు సుందరంగారి కేకలు. వచ్చే యేడ్పును దిగమ్రింగుకొంటూ నెమ్మదిగా అక్కడినుండి తప్పుకొంది.

ఆమె మనస్సు వికలమైంది. తనకు బంగారపు వస్తువులు పెట్టుకొనే రాత లేదంటే తన తల్లిగారి పేదతనాన్ని వేలెత్తి చూపినట్లేనా ? ఔను ..... తన తండ్రి ఉన్నవాడే అయితే యీరోజు ఇది జరుగకపోయి ఉండేది. చెయ్యని నేరానికి తిట్లుతినే అవసరమూ ఉండేది కాదు. ఛీ.... ఛీ ..... అందరూ తనను తిట్టేవారే. శాంత మనస్సులో కల్లోలం బయలుదేరింది. ఓదార్చేవారు లేరు. మంచివా రనుకొన్న తన భర్త కూడ యిట్టే కోపం తెచ్చుకొంటారు. "నీవెన్ని చెప్పు. ముసలివారికి కోపం ఎక్కువంటారు." లలిత అన్న మాటలు చటుక్కున జ్ఞాపకం వచ్చాయి. ఆ క్షణంలో నిజమే ననిపించింది శాంతకు. ఒక్కసారి భళ్లున శబ్ద మయ్యింది. కూరగాయలు తరుగుతూ ఆలోచనలతో కొట్టుకొంటున్న శాంత ఉలిక్కిపడి తలయెత్తి చూచింది. పొయ్యిమీద పెట్టిన పాలకుండ పదహారు ముక్క లయ్యింది. కుండెడు పాలూ నేలపాలయ్యాయి. దాని కంతటికి కారణమైన పిల్లి నేలపాలైన పాలను త్రాగుతోంది. శాంత నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది.

"అయ్యయ్యో ! పాలకుండ ముక్కలయ్యిందేమె. అంత మరీ పరధ్యానమైతే యెలా ? ఇక ఈ సంసారం బాగుపడినట్లే ! ఏదో చిన్న వస్తువు తెగిందని యింక అదే తల్చుకుంటూ బాధపడితే అయినట్లే" నాలుగు చివాట్లు పెట్టింది అత్తగారు. శాంత మాట్లాడకుండా లేచి పెంకులూ పాలు ఎత్తి అవతల పోసింది. "మీ అత్తగారు కోపిష్ఠి, ఎలా వేగుతావో ఏమో" కాంతమ్మగారి మాటలు చెవిలో మారు మ్రోగుతున్నాయి. జరుగుతున్న సంఘటనలతో ఆమె హృదయం ఒక్కొక్కటిగా బీటలువారుతోంది. ఆమె నెమ్మదిగా తన మనస్సును సమాధాన పర్చుకొంది.

మరునాడు ఆదివారం. పిల్లలు ముగ్గురూ కలసి భోజనానికి కూర్చున్నారు. చివరిలో "పెరుగు పొయ్యమ్మా !" అన్నది సుగుణ.

"ఈరోజు పెరుగు లేదమ్మా. పాలకుండను పిల్లి తన్నేసింది. ఈ రోజుకి కూర వేసుకు తిను. ఇంకొంచెం కూర వెయ్యనా ?" అన్నది శాంత.

"ఉహూ, నాకు పెరుగే కావాలి. ఇంకేం వద్దు." కంచం నెట్టేసింది సుగుణ. ఏంచెయ్యాలో తోచలేదు శాంతకు.

"పెరుగు లేదని అమ్మ చెప్తుంటే ఆ అల్లరేమిటే సుగుణా ! ఉన్నప్పుడు అక్కర్లేదంటావు. లేదన్నప్పుడు కావాలి. తప్పు కదూ ? కూర వేసుకు తిను." సూర్యం చెల్లిని మందలించాడు. సుగుణ కోపంగా కంచం దగ్గర నుండి లేచి వెళ్లిపోయింది. చంద్రానికీ కష్టంగానే ఉన్నది. అతనికి పెరుగంటే యిష్టం. నెమ్మదిగా చారు పోసుకుని తిని లేచాడు. శాంతకు బాధ కల్గింది. ఏం చెయ్యలేక ఊరుకుంది.

"చుట్టాలు వచ్చారు. కొంచెం మజ్జిగ ఉంటే పొయ్యి సీతమ్మ వదినా" అంటూ వచ్చింది కాంతమ్మగారు.

"అయ్యో ! ఈరోజు మజ్జిగలేదు పిన్నిగారూ. పిల్లలకు కూడా లేకుండా పోయింది. నిన్న పాలన్నీ పిల్లి తన పొట్టన పెట్టుకొంది." శాంత చెప్పింది.

"మీ అత్తగారు పడుకొన్న దేమిటి ? అయితే వస్తానమ్మా !" కాంతమ్మగారు ముఖం నల్లగా మాడ్చుకొని అన్నది. "ఏదీ, సీతమ్మ వదిన. ఒకసారి పలుకరించిపోతాను." అంటూ లోపలకు వెళ్లింది.

ఆ రాత్రి ఎనిమిదయ్యేసరికి పిల్లలు అన్నాలు తిన్న తరువాత పనులు ముగించుకొని వచ్చి నడుం వాల్చింది శాంత. ఇంకా సుందరంగారు ఇంటికి రాలేదు. జరిగిన సంఘటనలు

తల్చుకొని బాధపడుతోంది ఆమె. ప్రక్కనున్న పిల్లల చదువు కొనే గదిలో నుండి మాటలు వినిపించాయి.

"చంద్రం ! ఇలారా !" అని పిలుస్తున్నాడు సూర్యం. చంద్రం దగ్గరకు వచ్చినట్లున్నాడు. "సాయంత్రం ఏమిటిరా చెల్లికి చెప్తున్నావు ?" సూర్యం ప్రశ్నించాడు.

"ఏసంగతన్నయ్యా ! చెల్లికేమి చెప్తున్నాను ?" చంద్రం అడిగాడు అర్థంకాక.

"అమ్మను గురించి ఏమిటో చెప్తున్నావుకదూ ?" సూర్యం ప్రశ్న. చంద్రానికి అర్థమైనట్లున్నది అన్న అడిగేది. "ఏంలే దన్నయ్యా" అంటూ తప్పించుకోబోయాడు. ఈ మాటలు విన్న శాంత కుతూహలం ఎక్కువైంది. చెవులు రిక్కించుకొని వినసాగింది.

"అలా ముఖం తప్పించుకొంటావేంరా ! అమ్మను "అమ్మ" అని పిలవవద్దని చెప్తున్నావు కదూ ?" కాస్త కోపంగా విన్పించింది సూర్యం గొంతు. ఒక్కసారి శాంత గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. "ఏమిటి తాను వింటున్నది. తనను "అమ్మా !" అని పిలవడం యిష్టంలేదా చంద్రానికి.

"ఔనన్నయ్యా ! అమ్మలా చూడకపోతే అమ్మని పిలవడం ఎందుకు ? మధ్యాహ్నం చెల్లి పెరుగు కావాలంటే పోసిందా ?" చంద్రం ఎదురు తిరిగి ప్రశ్నించాడు.

"వెధవా ! నీకు పుట్టిన బుద్దేనా యిది ?' పెరుగు లేకపోతే అమ్మేం చేస్తుంది. పాలు పిల్లి తన్నేసిందని చెప్ప లేదూ ? ఏమీ తెలియని చెల్లికి వెధవ బుద్ధులన్నీ నేర్పు తున్నావా ?" కోపంగా మందలించాడు సూర్యం.

"మన అమ్మ ఎప్పుడైనా యిలా లేదని చెప్పిందా అన్నయ్యా ! మొన్న మాత్రం సుగుణ నెక్లెస్ తెంచిందని పెంకెపిల్లవంటూ తిట్టలేదూ ? మన అమ్మ ఎప్పుడూ నాకు తల దువ్వి బడికి పంపేదికదా, యీ అమ్మ ఎప్పుడైనా అలా చేసిందా ?"

ఇవన్నీ వినేసరికి సూర్యానికి అసహనం కల్గి నట్లుంది. "చాల్లే, చేసిన పొరపాటు చాలక యింకా కబుర్లు చెబుతున్నావు. "అమ్మా ! నాకు తల దువ్వ" ని ఎప్పుడైనా అమ్మ దగ్గరకు వెళ్లావా ? అమ్మ క్రొత్తగా వచ్చింది కదా, యివన్నీ ఎలా తెలుస్తాయి. తను పిల్చినా దూరం దూరంగా ఉంటావు. ఇంకా తల దువ్వదు అంటూ నెపం వేస్తున్నావు. అయినా ఎవర్రా నీ కివన్నీ చెప్పిపెట్టింది ?" కోపంగా ప్రశ్నించాడు సూర్యం.

చంద్రం నెమ్మదిగా సమాధానం చెప్పాడు "నాకేం తెలుసు. మధ్యాహ్నం కాంతమ్మ అవ్వగారు అంటున్నారు." శాంత యిక పై మాటలు వినలేదు. ఆమెకు అంతా అర్థ మయ్యింది. "మధ్యాహ్నం మజ్జిగంటూ వచ్చి చంద్రాని కివన్నీ చెప్పిపెట్టిందన్నమాట. పిల్లల హృదయాల్లో కూడ విష బీజాలు నాటాయి. చెప్పినవన్నీ నమ్మే స్వభావం చిన్నపిల్లలది. ఇక వాళ్లు కూడ తనను పరాయి మనిషిగా చూస్తే తన జీవిత మేమిటి ?" శాంత కంటినుండి కన్నీరు కాల్వలు కట్టాయి.

"శాంతా ! అన్నం వడ్డించు." సుందరంగారు ఎప్పుడు వచ్చారో, ఆయన పిలుపుతో ఉలిక్కిపడి కళ్లు తుడుచుకొని లేచింది.

* * * *

మరో రెండు సంవత్సరాలు కాలగర్భంలో కలిసి పోయాయి. ఇప్పుడు శాంతకు ఒక కొడుకు. వాడితో మరి కొంచెం పని ఎక్కువయ్యింది శాంతకు.

అప్పటివరకు వంటలో సతమతమవుతున్న శాంత గుక్కపెట్టి ఏడుస్తున్న పిల్లవాణ్ణి లేవదీసి పాలు పట్టి స్తోంది. అంతలో సుగుణ వచ్చింది. "అమ్మా ! అన్నం పెట్టమ్మా !" అంటూ. "ఒక్క నిముషం ఉండు సుగుణా ! తమ్ముడికి పాలు పట్టించి వస్తాను." అన్నది శాంత.

ఒక క్షణం వూరుకొని "త్వరగా రా అమ్మా ! నాకు ఆకలి మండిపోతోంది." సుగుణ మళ్లీ మొదలుపెట్టింది.

"కొంతసేపు ఆగమన్నాను కదమ్మా ! తమ్ముడు పాల కోసం ఒక్కటే ఏడుస్తున్నాడు. ఆకలేసి."

"వాడి కస్తమానం పాలే. నాకూ ఆకలేస్తోంది. నాకు పెట్టేసి వెళ్లు." కొంచెం గారం, మరికొంత మొండితనం మిళాయించి గునిసింది సుగుణ. శాంత అసలే పిల్లవాడి యేడ్పుతో, పనుల వత్తిడిలో విసుగెత్తి ఉంది.

"అంత ఆకలేస్తుంటే గొడవ చెయ్యక వెళ్లి పెట్టుకు తినరాదూ ?"

సుగుణ మొండికెత్తి కూర్చుంది. "నువ్వే పెట్టు."

"అయితే, ఆగు వచ్చి పెడ్తాను" శాంత పిల్లవాడికి పాలు పట్టడంలో నిమగ్నమయింది.

"ఇప్పుడే పెట్టు. నాకు ఆకలేస్తోంది." అంటూ క్రింద చతికిలపడింది సుగుణ రాగంతీస్తూ. శాంతకు చిర్రెత్తు కొచ్చింది.

"అబ్బబ్బ ! నా ప్రాణాలు తీస్తున్నావు. వెధవా ! నీకూ ఇప్పుడే కావాలా పాలూ ?"

శాంత పిల్లాడిని మంచంమీద పడేసి లేచింది. 'లే తల్లీ! నీకు అన్నం పెడ్తాను"

పిల్లవాడు మళ్లీ గుక్కపెట్టి ఏడ్వడం మొదలు పెట్టాడు.

అంతలో సుందరంగారు వచ్చారు. "శాంతా ! వాడలా ఏడుస్తుంటే లేవదీయరాదూ ? విన్పిస్తోందా లేదా ?" అని కేక వేశారు.

"నాకు నాల్గు చేతుల్లేవు" విసుగ్గా గొణుక్కుంది శాంత.

రోజులు జరుగుతున్నాయి. రానురాను సుగుణ పెంకెతనము పెరుగుతోంది. దానికి నాయనమ్మగారి మద్దత్తు ఉన్నది. శాంతకు అసహనం ఎక్కువవుతోంది. ఆరోజు సుగుణ బడినుండి వచ్చిన మరో అరగంటలో సుగుణతో చదువుకొనే మరో అమ్మాయి లక్ష్మి వచ్చింది.

"సుగుణ లోపల ఉన్నట్లున్నది, వెళ్ళు లక్ష్మి !" అన్నది శాంత.

మరో పది నిముషాలలో ఆపిల్ల లిద్దరూ పోట్లాడుకుంటున్న సవ్వడి వినిపించింది శాంతకు. చేస్తున్న పని నిలిపి వెళ్లింది. లక్ష్మి ఏడవడానికి సిద్ధంగా ఉన్నది.

"నీవు నాకేం యివ్వలేదు. ఎవరికిచ్చావో వెళ్లి అడుగు" అని అంటున్నది సుగుణ.

"ఏమిటమ్మా ! మీ రిద్దరు పోట్లాడుకొంటున్నారు ? ఏమయ్యిందేమిటి ?" అని అడిగింది శాంత నవ్వుతూ.

"చూడండి పిన్నిగారూ, సుగుణ నా పెన్ను ఎత్తుకొచ్చింది. అడుగుతుంటే లేదంటుంది." అని ఫిర్యాదు చేసింది లక్ష్మి. దొంగతనం అనేసరికి శాంత ముఖంలో నవ్వు మాయమయింది. సాయంత్రం బడినుండి వచ్చిన తరువాత సుగుణ చేతిలో పెన్ను తనూ చూచింది. అది చంద్రందో, సూర్యందో అయిఉంటుం దనుకొన్నది తాను. సుగుణ దొంగిలించిందే గాక అబద్ధం కూడా చెప్తోందా ?

"సుగుణా ! లక్ష్మికి పెన్ను యిచ్చేసెయ్యి." అన్నది కొంచెం తీవ్రంగా.

"నేనేం తియ్యలేదు. వెళ్లి కమల నడుగు. నాకేం తెలుసు." సుగుణ పెంకెగా బవాబు చెప్పింది. లక్ష్మి బిక్కమొఖం పెట్టింది. "కమల తియ్యలేదట. నీవు తీశావన్నది" అన్నది ఏడుపు గొంతుతో లక్ష్మి.

ఆరోజు బడిలో ఆపిల్ల లిద్దరికి ఆటల్లో పోట్లాట వచ్చింది. లక్ష్మి సుగుణను బాగ ఏడ్పించింది. ఆ ఉక్రోషంలో సుగుణ ఆపిల్ల పెన్ను ఎత్తుకొచ్చింది. ఆ కోపం ఇంకా పోలేదు.

సుగుణ పెన్ను తీసే తీయలేదని చెప్తూఉంటే శాంతకు కోపంవచ్చింది. చిన్నపిల్లల తప్పుల్ని యెప్పటికప్పుడు సరిదిద్దితేగాని వాళ్లకు మంచి అలవాట్లు ఏర్పడవు. అయినా మరో అమ్మాయి ముందు దండిస్తే ఆ పిల్లల అభిమానం దెబ్బతింటుంది. శాంత యిదే ఆలోచనతో "నీవు వెళ్లమ్మా ! సుగుణ దగ్గరనుండి తీసుకొని నేను తరువాత యిస్తానులే" అన్నది లక్ష్మితో. ఆ అమ్మాయి ఏడుపుమొఖంతో వెళ్లిపోయింది.

"సుగుణా ! అలా క్లాసుపిల్లల పెన్నులు ఎత్తుకు రావటం తప్పుకదూ ? ఎక్కడ పెట్టావో తెచ్చి యిచ్చెయి" అన్నది అనునయంగా.

"నేనేం తియ్యలేదు. నాకేం తెలియదు." అన్నది సుగుణ మొండిగా. ఆపిల్ల అలా మాటిమాటికీ అబద్ధాలు చెప్తూఉంటే శాంతకు వెర్రి కోపం వచ్చింది.

"దొంగతనం చేసింది చాలక అబద్ధాలు కూడానా ? నీవు పెన్ను తెస్తుంటే నేను చూశాను. నీవు ఆ పెట్టెమీదలే. నేను నీ పెట్టె చూస్తాను" అంటూ శాంత ముందు వచ్చింది. ఇక దానితో సుగుణకు ఏమి చేయాలో తోచలేదు.

"నేను తియ్యలేదు. నాకేం తెలియదు." అంటూ రాగం తీస్తూ లేచింది. శాంత పెట్టె తెరిచేసరికి యిక గంతు లెయ్యడం మొదలుపెట్టింది. ఆ కోపంతో చేతికి దొరికిన వస్తువును అందుకొని గిరవాటు వెయ్యడం మొదలుపెట్టింది. అక్కడే ఉన్న పౌడరు డబ్బా విసిరేసరికి అప్పుడే తప్పటడుగులు వేస్తూ వస్తున్న కృష్ణుడికి తగిలింది. వాడా దెబ్బకు క్రిందపడి గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టాడు. బట్టల అడుగున ఉన్న పెన్ను బయటకు తీస్తున్నది శాంత అప్పుడే. ఆమెకు పిచ్చి కోపం వచ్చింది. గబగబా వచ్చి సుగుణను వీపుమీద నాలుగు వాయించింది. "మరీ పెంకిపిల్లవైపోయావు. ఎవరి భయం లేకుండా పోయింది."

ఆ దెబ్బలతో సుగుణ ఒక్కసారి యిల్లు ఎగిరిపోయేలా గొంతెత్తింది. ఆ ఏడుపు వింటూనే పరుగెత్తుకొచ్చింది సీతమ్మగారు. "అయ్యయ్యో ! తల్లిలేని పిల్లను పట్టుకొని చితక తంతున్నావు. దాన్ని చంపేస్తే వేమిటే ?" అంటూ. నాయనమ్మను చూడగానే సుగుణకు ఇంకా కట్టలు తెంచుకు వచ్చింది యేడుపు. ఆవిడను పట్టుకొని ఒక్కసారి బావురుమన్నది.

"అత్తయ్యా ! మీ రుండండి. మీరు మరీ గారాం నేర్పేస్తున్నారు. అన్నీ చెడ్డ అలవాట్లు నేర్చుకొంటున్నది" అన్నది శాంత సుగుణవంక కోపంగా చూస్తూ.

సీతమ్మగారు ఉగ్రురాలైపోయింది. "చిన్నపిల్ల తెలియక ఏమైనా చేస్తే దాన్ని చచ్చేట్లు కొడతావా ?"

"అది కాదు అత్తయ్యా ! ఇప్పుడు దండించకపోతే అవే అలవాట్లు పెద్దయినా ఉండిపోతాయి. వాళ్ల క్లాసుపిల్ల ....' అంటూ శాంత చెప్పబోయేసరికి "చాల్లే తల్లీ ! నీ పిల్లలికి కూర్చుంటే ఒకటి నుంచుంటే ఒకటి తగల్నిస్తూ మంచి అలవాట్లు నేర్పు. దీన్ని ఇలా ఏడవనీ .... !" అంటూ సీతమ్మగారు సుగుణను తీసుకొని వెళ్లిపోయింది. ఆ మాటలు కొరడాతో వీపుమీద కొట్టినట్లు తగిలాయి శాంతకు.

"తల్లిలేని పిల్ల !" వెక్కిరించినట్లు విన్పించింది. "భార్యలేని సుందరంగారికి ఆ లోటు తీర్చేందుకు వచ్చింది కాని, తల్లిలేని పిల్లలకు అమ్మగా రాలేదు. వాళ్లు తప్పు చేస్తున్నా దండించే అర్హత తనకు లేదు. తాను వాళ్లకు తల్లి కాదు. .... సవతి తల్లి. ఛీ ! .... ఛీ ! ఏమి సంఘం ? ఏమి మనుష్యులు ? రేపు యీ చెడు బుద్ధులే చిలవలు పలవలు

వేస్తే దానికి నిందించేది తననే. ఏమి బ్రతుకు ? శాంత హృదయం బాధతో కుమిలిపోసాగింది. కృష్ణుడు ఇంకా క్రింద పడి వెక్కుతున్నాడు. ఆ చంటివాడి ఏడుపు గాని, వాడికి తగిలిన దెబ్బగాని సీతమ్మగారికి కన్పించలేదు. వాడికి అమ్మ ఉంది. ఆమె మరొకళ్లకు సవతి తల్లి. అందుకే పాపం వాడి ఆలనా పాలనా ఆమెకు అవసరం లేకపోయింది.

రోజులు చాల నిస్సారంగా గడిచిపోతున్నాయి శాంతకు. ఆమె కిప్పుడు ఎవరి మంచి చెడ్డలు అవసరంలేదు. తన వంటేమో, తన పిల్లవాడేమో .... ఇదే ఆమె పనులు. ఎవరైనా కావాలన్నవి అమర్చిపెడ్తుంది. సీతమ్మగారు ఒకసారి కాంతమ్మగారితో అంటున్న మాటలు శాంత చెవిని పడ్డాయి· "ఏం చేస్తాం! వాళ్ల కర్మ కొద్దీ వాళ్ల అమ్మ చచ్చింది. ఈవిడొచ్చింది. దాని కొడుకేమో, అదేమో. వీళ్ల ఉంటున్నారో, చస్తున్నారో దాని కవసరం లేదు. ముసిలిదాన్ని. వీళ్ల బాధలన్నీ చూస్తూ నేను పడిఉన్నాను."

సహనానికైనా ఒక హద్దు ఉన్నది. ఏ తీగైనా సాగదీస్తే సాగుతుంది. మరీ లాగితే పుటుక్కుమంటుంది. అదే అయ్యింది. శాంత సహనం చచ్చిపోయింది. "అవును. వాళ్ల అవసరాలు నాకేం పట్టింది ? నేనేం వాళ్ల తల్లిని కనుకనా ? సవతి తల్లిని! సవతి తల్లి ఎలా ఉంటుందో మీకు తెలుసుగా? ఇంకా ఎందుకు చెప్పుకోవడం ?" తన బాధనంతా ఆ మాటల్లో కక్కేసింది. సీతమ్మగారు నిర్ఘాంతపోయి అలా చూస్తూ ఉండిపోయింది కొంతసేపు.

"అంతవరకూ వచ్చేవుటే నీవు ? ఎంత బరితెగించి పోయేవే ?" సీతమ్మగారు తెప్పరిల్లి నోరు నొక్కుకోసాగింది. కాంతమ్మగారు నెమ్మదిగా అక్కడనుండి తప్పుకొన్నది. శాంత ఇంకా రెచ్చిపోయింది. "ఈ కొంపలో మంచిగా ఉన్నవాళ్లకి రోజులు గడవవు. ఎదుటివాళ్లను బట్టి మనుషులు మారుతూ ఉండాలి. ఇక నేను మడికట్టుకు కూర్చుంటే ఈ ఇంట్లో బ్రతగ్గలనా ?" అత్తగారి గొంతుకకు రెట్టింపు గొంతుతో సమాధానమిచ్చింది.

అంతలోనే సుగుణ కృష్ణుడి చొక్కా పట్టుకొని "ఛల్, ఛల్ ! నడవరా నడు." అంటూ ఏడుస్తున్న వాడిని కర్రతో ఝుళిపిస్తూ నడిపించుకొస్తూంది. శాంతకు మండిపోయింది.

"వాడిని చూస్తుంటే నీకు కొట్ట బుద్దేస్తుందాయేం ? ఎప్పుడూ వాడి ప్రాణానికి పడి ఏడుస్తావు ?" అంటూ ఆ పిల్ల చేతిలోని కర్ర అందుకొని రెండు తగలనిచ్చింది. సుగుణ ఆ దెబ్బతో బావురుమన్నది. ఆపిల్లలిద్దరి యేడ్పుతో, సీతమ్మగారి కేకలతో ఇల్లు మారుమ్రోగిపోయింది.

* * *

ఈనాడు ఆ ఇంటిలోని వాతావరణం పూర్తిగా మారిపోయింది. సీతమ్మగారు పక్షవాతంతో మంచాన పడింది. గొంతెండిపోతోంది. కాస్త మంచినీళ్లు పొయ్యండీ ! అంటే పలికేవాళ్లు లేరు. "వచ్చేవరకు ఆగలేరూ ? ఇక్కడ ఖాళీగా కూర్చున్నానా ఏమిటి ?" అని సమాధాన మిస్తుంది శాంత. ఆమె ఉగ్రరూపం చూచి నోరెత్తలేదు సుందరంగారు. సవతి తల్లిని చూచి తల వంచుకొని వెళ్లిపోతాడు సూర్యం. అస లామె ఛాయలకే రాడు చంద్రం. సవతి తల్లిని చూచి వణికిపోతుంది సుగుణ. ఇప్పు డామెకు నోరు విప్పి మాట్లాడడానికి భయం.

తల్లిలేని పిల్లలకు "అమ్మ" కావాలనుకొన్నది శాంత. కాని పరిసరాలు, మనుష్యులు ఆమెను "సవతి తల్లి" ని చేశాయి.